Andra Jyothi Date :- 17/05/2023

# 'ఎయిర్‌పోర్టు మెట్రో'కు అంతర్జాతీయ టెండర్లు

**బిడ్ల దాఖలుకు జూలై 5 దాకా గడువు**

**అంచనా వ్యయం రూ.5,688 కోట్లు**

**9 స్టేషన్లు.. అవసరాన్ని బట్టి మరో 4**

**హెచ్‌ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి**

హైదరాబాద్ సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ కారిడార్ పనుల్లో వేగం పెంచారు. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో నిర్మించనున్న పనులకు అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్ (హెచ్‌ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

మిగతా 13వ పేజీలో...

## 'ఎయిర్‌పోర్టు మెట్రో'కు అంతర్జాతీయ టెండర్లు

(మొదటిపేజీ తరువాయి)

మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు అంచనా వ్యయం రూ.5,688 కోట్లన్నారు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన సర్వే, పెగ్ మార్కింగ్ (కిలోమీటర్ల హద్దుల ఏర్పాటు), అలైన్‌మెంట్ నిర్ధారణ లాంటి ప్రాథమిక పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, భూ సామర్థ్య పరీక్షల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం చేపట్టిన కొత్త సర్వే ప్రకారం రాయదుర్గ్ మెట్రోస్టేషన్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు టెర్మినల్ స్టేషన్ల మధ్య దూరం 31 కిలోమీటర్లు ఉందని, ఇందులో ఎలివేటెడ్ కారిడార్ 29.3 కి.మీ.; భూగర్భంలో 1.7 కి.మీ. మేర పనులు జరుగుతాయని వివరించారు. విమానాశ్రయం టెర్మినల్, భూగర్భ స్టేషన్‌తో కలిపి మొత్తం 9 స్టేషన్లు ఉంటాయని తెలిపారు. సీఎం కేసీఆర్ సూచించిన విధంగా నగర శివార్లలో ఉండే మధ్యతరగతి ప్రజలు తక్కువ ఖర్చుతో ఎయిర్‌పోర్టు మెట్రో రైలుకు చేరుకునే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. అవసరమైతే భవిష్యత్‌లో అదనంగా మరో 4 స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు గ్లోబల్ టెండర్ల దాఖలుకు జూలై 5 వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. రూ.6250 కోట్లతో చేపడుతున్న పనుల్లో రూ.5,688 కోట్లు నిర్మాణానికి, మిగతా రూ.562 కోట్లు పెగ్‌మార్కింగ్, ఇతర పనులకు కేటాయించినట్లు ఎండీ పేర్కొన్నారు.